సాక్షి జనగామ

మంగళవారం । 13 । ఆగస్టు । 2024



వివరాలు పంపకుంటే చర్యలు

రుణమాఫీకి అర్హులైన రైతుల వివరాలు ప్రభుత్వానికి పంపని పీఏసీఎస్ సిబ్బందిపై చర్యలు తీసుకోనున్నట్లు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తెలిపారు. - 8లో▸



ఆభరణాలతోపాటు మద్యం సీసాలనూ ఎత్తుకెళ్లారు

- 8లో▸

ఇంట్లోని బంగారు, వెండి ఆభరణాలతో పాటు మద్యం సీసాలనూ దొంగలు అపహరించారు. ఈ ఘటన కురవిలో చోటుచేసుకుంది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33^0 /24^0

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

ఏసీబీ వలలో వరుసగా..

అయినా తగ్గేది లేదంటున్న లంచావతారులు

- 8 నెలల్లో 11 మంది పట్టివేత
- ప్రతినెలా చిక్కుతున్నా.. భయపడని అక్రమార్కులు
- కొన్ని కార్యాలయాల్లో మధ్యవర్తులతో వసూళ్లు
- తాజాగా ఏసీబీ వలలో గుడికుంటతండా ప్రత్యేకాధికారి
- మానుకోట రవాణాశాఖ అధికారి అరెస్ట్



హనుమకొండలో పట్టుబడిన ఏఈ గోపాల్

సాక్షిప్రతినిధి, వరంగల్/వరంగల్‌క్రైం/మహబూబాబాద్ అర్బన్: లంచావతారులపై అవినీతి నిరోధకశాఖ పంజా విసురుతోంది. ఈ ఏడాది వరుసగా అవినీతి అక్రమార్కులు చిక్కుతున్నా, కొందరు లంచాలు తీసుకోవడంలో వెనక్కితగ్గేది లేదంటున్నారు. 8 నెలల వ్యవధిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11 మంది అవినీతి అధికారులను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏ చిన్న పనికైనా చేయి చాపడం.. డబ్బులివ్వకపోతే పీడించడం.. ఇలా విసుగు చెందిన వారు ఏసీబీని ఆశ్రయిస్తుండడంతో లంచావతారుల బాగోతం బయటపడుతోంది. ఉమ్మడి జిల్లాలో సోమవారం రెండు శాఖలకు చెందిన అధికారులు.. అవినీతి నిరోధకశాఖ అధికారులకు చిక్కడం చూస్తుంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అవినీతికి కాదేది అనర్హం..

భూమి రిజిస్ట్రేషన్ చేయాలన్నా.. పూర్తయిన పనులకు బిల్లులు మంజూరు చేయాలన్నా.. ఏ పని కావాలన్నా సంబంధిత శాఖలోని కొందరు అధికారులు చేయి తడపనిదే పని చేయట్లేదు. ఈ ఏడాది వరుస దాడుల్లో రిజిస్ట్రేషన్, వైద్య, విద్య, లేబర్, రవాణా, ఇరిగేషన్ శాఖల అధికారులు పట్టుబడ్డారు. అన్ని కాగితాలు ఉన్నాయి.. పలానా పని చేసి పెట్టండని అధికారుల దగ్గరికి వెళ్తే ఆ పనికి లెక్కకట్టి లంచం డిమాండ్ చేస్తున్నారు. అంత ఇచ్చుకోలేమని, డబ్బులు లేవని చెబితే రేపుమాపు అంటూ తిప్పుకుంటున్నారు. చివరికి 'మీరు అడిగిన మొత్తాన్ని ఇచ్చుకోలేను. అందులో కొంత ఇస్తాను' అని మధ్యేమార్గంగా అంతో ఇంతో ముట్టజెప్పి పనులు చేయించుకుంటున్నారు. కొందరు సామాజిక స్పృహ కలిగిన వారు, విద్యావంతులైతే లంచావతారుల తీరుతో విసుగుచెంది ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. ఈ ఏడాది పట్టుబడిన కేసులు ఇలా ట్రాప్ చేసినవే.

కొన్ని శాఖల్లో మధ్యవర్తులు..

మరికొన్ని శాఖల్లో అధికారులు చేతికి మట్టి అంటకుండా మధ్యవర్తులను నియమించుకుంటున్నారు. వీరి ద్వారా ఆమ్యామ్యాలను పుచ్చుకుంటున్నారు. గత నెలలో పరకాల సబ్‌రిజిస్ట్రార్ సునీత పట్టుబడింది ఇలానే. డాక్యుమెంట్ రైటర్ నరేశ్‌ను మధ్యవర్తిగా పెట్టుకుని అతడి ద్వారా వ్యవహారాలు నడిపించారు. తాజాగా మానుకోట డీటీఓ గౌస్‌పాషా కూడా ప్రైవేట్ అసిస్టెంట్ నుంచే లంచాలు వసూలు చేశారు. ఈ శాఖ అనే కాదు.. ఆర్టీఏ, రెవెన్యూ, వైద్యం తదితర శాఖల్లోనూ ఇలాంటి మధ్యవర్తులు ఎందరో ఉన్నారు. ఏదైనా పని కావాలంటే అధికారులు ముందుగా మధ్యవర్తులను సంప్రదించాలని చెప్పి పంపుతున్న పరిస్థితి.

> **భయపడకుండా సమాచారమివ్వండి..**
> ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు కొందరు లంచాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయంలో పారదర్శకంగా చేయాల్సిన పనికి లంచం అడిగితే నిర్భయంగా మాకు సమాచారం ఇవ్వండి. అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. **- సాంబయ్య, ఏసీబీ డీఎస్పీ**



పోలీసులు అరెస్ట్ చేసిన మహబూబాబాద్ రవాణాశాఖ అధికారి తోపాటు డ్రైవర్, ప్రైవేట్ అసిస్టెంట్లు

ఐదేళ్లలో ఏసీబీ కేసులు ఇలా..

సంవత్సరం	కేసులు
2020	07
2021	07
2022	09
2023	11
2024 (ఆగస్టు 12 వరకు)	11

ఈ ఏడాది వరుస దాడులు -8లో▸

రూ.10 వేలు లంచం తీసుకుంటూ..

గ్రామంలో చేసిన అభివృద్ధి పనికి బిల్లులు పాస్ చేసేందుకు రూ.10వేల లంచం తీసుకుంటూ జనగామ జిల్లా పాలకుర్తి ఇరిగేషన్ ఏఈ, గ్రామ ప్రత్యేక అధికారి గోపాల్ సోమవారం హనుమకొండలో ఏసీబీ అధికారులకు చిక్కాడు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత స్పెషల్ అధికారులను నియమించింది. అందులో భాగంగా జనగామ జిల్లా పాలకుర్తి మండలం గుడికుంటతండాకు ప్రత్యేక అధికారిగా అదే మండలానికి చెందిన ఇరిగేషన్ ఏఈ గుగులోత్ గోపాల్‌ను నియమించారు. గ్రామంలో మాజీ ఎంపీటీసీ బానోత్ యాకూబ్ చేసిన అభివృద్ధి పనికి బిల్లు చెల్లించడానికి ప్రత్యేక అధికారి అయిన గోపాల్ రూ.10 వేలు లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ప్లాన్ ప్రకారం యాకూబ్ సోమవారం నక్కలగుట్టలో ఉండి ఫోన్ చేయగా.. గోపాల్ కారులో వచ్చి డబ్బులు తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గోపాల్‌ను అదుపులోకి తీసుకుని వెంటనే హైదరాబాద్‌కు తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. దాడిలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు శ్యాంసుందర్, సాట్ల రాజు, ఎల్.రాజు పాల్గొన్నారు.

మానుకోట డీటీఓ @ రూ.2.97 కోట్లు

మానుకోట జిల్లా రవాణాశాఖ అధికారి (డీటీఓ)గౌస్ పాషా, ప్రైవేట్ అసిస్టెంట్ సుబ్బారావు, కారు డ్రైవర్ రాంగోపాల్‌ను ఏసీబీ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. మే 28న మహబూబాబాద్ జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు చేసి ఏజెంట్ల నుంచి రూ.45,100, డీటీఓ డ్రైవర్ నుంచి రూ.16,500, జూనియర్ అసిస్టెంట్ నుంచి రూ.895 నగదును స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతోపాటు లెక్కల్లో చూపని నగదు, మొబైల్‌ను స్వాధీనం చేసుకుని రోజువారీ, నెలవారీ లంచం, మామూళ్లు, వివిధ ఖాతాలకు సంబంధించిన ఆన్‌లైన్ లావాదేవీలను ఏసీబీ అధికారులు పరిశీలించారు. ఇందులో నేరారోపణలను ఆధారాలతో సహా గుర్తించారు. దీంతో ఏ–1గా గౌస్‌పాషాపై కేసు నమోదు చేశారు. గౌస్‌పాషా ఎంవీఐగా ఉన్న సమయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేసినట్లు విచారణలో తేలింది. అదేవిధంగా కరీంనగర్, ఖమ్మం ఆర్టీఓ కార్యాలయంలో ఫుల్ అడిషనల్ డీటీఓగా పనిచేసి అక్కడి నుంచి సుమారు ఏడాదిన్నరక్రితం మానుకోట జిల్లా రవాణాశాఖ అధికారి(డీటీఓ)గా వచ్చారు. ఈ క్రమంలో ఏజెంట్లు, వాహన యజమానుల నుంచి రూ. 2,97,38,000 లంచం వసూలు చేసినట్లు విచారణలో గుర్తించారు. వచ్చిన నగదు మొత్తాన్ని అతడి ప్రైవేట్ అసిస్టెంట్ తణుకు రాంగోపాల్(ఏ–5) బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఆ తర్వాత రాంగోపాల్ తన ఖాతా నుంచి మహ్మద్‌గౌస్ పాషాతోపాటు అతడి కుమారుడు మహ్మద్ ఆరిఫుద్దీన్(ఏ–3), ఆరిఫుద్దీన్ మేనల్లుడు మహ్మద్ మునీర్(ఏ–4), ప్రైవేట్ అసిస్టెంట్ యల్లమందల సుబ్బారావు(ఏ–2) బ్యాంకు ఖాతాలకు ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేశాడు. నేరారోపణలు రుజువు కావడంతో సోమవారం ఏ–1, ఏ–2, ఏ–5లుగా ఉన్న గౌస్‌పాషా, సుబ్బారావు, రాంగోపాల్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి వరంగల్ ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు. కేసు విచారణలో ఉందని ఏసీబీ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

పాఠశాల క్రీడా కార్యదర్శిగా ఆడెపు శ్రీనివాస్



జనగామ రూరల్: జిల్లా పాఠశాల క్రీడా కార్యదర్శిగా(2024–26 విద్యా సంవత్సరానికి) ఆడెపు శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం డీఈఓ కె.రాము నియామక పత్రం అందజేశారు. పట్టణంలోని బాలికల పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న శ్రీనివాస్ ఎంపిక కావడంపై తోటి ఉపాధ్యాయులు, అధికారులు అనోజ్‌కుమార్, అశోక్‌కుమార్, సుధారాణి, పద్మ, సంగీత, మాధురి, రవికుమార్, కిరణ్, ఇంద్రసేనారెడ్డి, నాగరాజు, కుర్షుస్ అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



జనగామ: విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం జనగామ మండలం పసరమడ్ల శివారులోని ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఐదు ఎకరాల స్థలంలో గురుకుల భవన నిర్మాణానికి కృషి చేస్తానని, స్థలం కేటాయింపు విషయమై సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. చదువుకు ఆటంకం కలుగొద్దని, ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని అన్నారు. ఎంపీ నిధుల కేటాయింపుతో మరిన్ని వసతులు కల్పించేలా చూస్తానన్నారు. గత పాలకులకు మద్యం వసూళ్లపై ఉన్న శ్రద్ధ పేద విద్యార్థులపై లేకుండా పోయిందని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాలనర్సిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్‌యాదవ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, నూకల బాల్‌రెడ్డి, బాలరాజు, రవి గౌడ్, చెంచారపు కరుణాకర్ రెడ్డి, కృష్ణగౌడ్, నారాయణ పాల్గొన్నారు.

జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలి



రఘునాథపల్లి: జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమరుల యాదిలో భాగంగా చేపట్టిన గీతన్నల చైతన్య యాత్ర సోమవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో చేపట్టిన యాత్రలను అన్ని జిల్లాల్లో నిర్వహించాలని పిలుపునిచ్చారు. వెంకటేష్, శ్రీనివాస్, రాజయ్య, శ్రీకాంత్, పరశురాములు, రవి, భిక్షపతి, మల్లేషం పాల్గొన్నారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

పాలకుర్తి టౌన్: పాఠశాలలో విద్యార్థినిపై క్యాటరింగ్ వర్కర్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితురాలి కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఓ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినిపై అదే పాఠశాలలో క్యాటరింగ్ సెక్షన్‌లో పనిచేసే వ్యక్తి వేధింపులకు పాల్పడ్డాడు. తట్టుకోలేక బాధితురాలు అనారోగ్యం పేరుతో ఇంటికి వెళ్లింది. అయితే స్కూల్‌కు వెళ్లాలని తల్లిదండ్రులు ఒత్తిడి తీసుకురావడంతో బాలిక ఏడుపు మొదలు పెట్టింది. కుటుంబ సభ్యులు ఆరా తీయగా విషయం వెల్లడించింది. దీంతో ప్రిన్సిపాల్, ఇతర బాధ్యులను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. ఘటనపై విచారణ చేపట్టి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయిప్రసన్నకుమార్ తెలిపారు.

నేడు పట్టణ బంద్

జనగామ: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండను నిరసిస్తూ నేడు(మంగళవారం) జనగామ పట్టణ బంద్‌కు విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, హిందూ వాహిని ఆధ్వర్యాన పిలుపునిచ్చినట్లు బాధ్యులు అర్జున్, పవన్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. నేడు చేపట్టే శాంతియుత ర్యాలీలో అందరూ పాల్గొనాలని, వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా మూసి వేసి సహకరించాలని కోరారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా



క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా



మినీ స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ప్రభుత్వ ఉద్యోగులు వర్సెస్ ఇతరుల మధ్య సోమవారం నిర్వహించిన క్రీడలు ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగాయి. ఈ పోటీలను రెవెన్యూ అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ప్రారంభించారు. అనంతరం జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది మధ్య జరిగిన టగ్ ఆఫ్ వార్, లెమన్ అండ్ స్పూన్ పోటీలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం వేడుకల కోసం చేపట్టిన ఏర్పాట్లను తనిఖీ చేశారు. మైదానంలో స్వచ్ఛత కనిపించేలా పనులు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ పార్థసారధి, ఆర్డీఓ కొమురయ్య తదితర అధికారులు ఉన్నారు. - జనగామ

చెరువులు, కుంటలను నింపాలి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే

బచ్చన్నపేట : జనగామ నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు నీరు లేక వెలవెల బోతున్నాయి.. వాటిని గోదావరి జలాలతో నింపాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీనిధి గార్డెన్‌లో పలు గ్రామాల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇది చాలా కరువు ప్రాంతమని, వర్షాలు సరిగా కురవక నీటి వనరులు ఎండిపోయి అన్నదాతలు నారు పోసి ఎదురు చూస్తున్నారని అన్నారు. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, బావుల్లో నీరు లేక నారు మళ్లు ఎండిపోతున్నాయని చెప్పారు. ఎగువన కురిసిన వర్షాలకు వస్తున్న గోదావరి వరద దిగువకు వృథాగా పోతోందని, దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలలో చెరువులు, కుంటలను నింపి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. ఘట్‌కేసర్‌లోని నీలిమా ఆస్పత్రిలో నియోజకవర్గ ప్రజలకు ఆధార్‌కార్డు చూపిస్తే ఉచిత వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, మండల అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి, కృష్ణంరాజు, అనిల్‌రెడ్డి, సాగర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, హరిప్రసాద్, కిష్టయ్య, ఫిరోజ్, మహేందర్‌రెడ్డి, శివకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు సహకరించాలి



ప్రజలతో మాట్లాడుతున్న ఏసీపీ భీమ్‌శర్మ

స్టేషన్‌ఘన్‌పూర్: మాదకద్రవ్యాలు, గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్టేషన్ ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపాన వివిధ షాపుల యజమానులు, వ్యాపారులతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయిని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా గంజాయి రవాణా చేసినా, సేవించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌లకు వచ్చే మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని, అనవసర లింక్‌లను ఓపెన్ చేస్తే సైబర్ క్రైమ్‌కు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ జి.వేణు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో సమాజ సేవ శిక్ష



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న బాబీ

వేలేరు: డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన మద్యంప్రియుడికి కోర్టు సమాజ సేవ శిక్ష విధించింది. ఈ నెల 9న హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో చిల్పూర్ మండలం రాజవరం గ్రామానికి చెందిన బాబీ అతిగా మద్యం తాగి ద్విచక్ర వాహనం నడపంతో పోలీసులకు దొరికాడు. అతనిపై కేసు నమోదు చేసి సోమవారం రెండో తరగతి కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా కొత్త చట్టాల ప్రకారం ఒక్క రోజు సమాజ సేవ చేయాల్సిందిగా న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఆ మేరకు వేలేరు పోలీసులు స్థానిక తహసీల్దార్ కోమి ఎదుట హాజరుపర్చగా ఆమె కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బాబీ పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించి శిక్ష పూర్తిచేశాడు.

జల్సాలకు అలవాటు పడి.. చోరీలు

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- రూ.5.74లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ రాజమహేంద్రనాయక్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్, పక్కన ఏసీపీ, సీఐ, ఎస్సై

జనగామ: రోజువారీగా కూలీ పని చేయగా వచ్చే ఆదాయం సరిపోవడం లేదు. పైగా జల్సాలకు అలవాటు పడ్డారు. ఇంకేముంది సులువుగా డబ్బు సంపాదించాలనుకున్నారు. దీనికి చోరీలే మార్గమని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా రాత్రి సమయంలో ఎవరూ లేని ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. ఇలా పలుచోట్ల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలు పోలీసులకు చిక్కారు. జనగామ పోలీసుస్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్.. ఏసీపీ పార్థసారధి, సీఐ దామోదర్‌రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని సింగరేణి కాలనీకి చెందిన చుకుటాల కుమార్, సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం అర్జునపట్లకు చెందిన బూరుగు యాదగిరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా గూడూరు మండలం దారకినిపాడుకు చెందిన తలతోటి ప్రవీణ్ కూలీ పని చేసుకుంటూ సింగరేణి కాలనీలో ముగ్గురు ఒకేచోట నివాసముంటున్నారు. ఇటీవల సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం కొత్త దొమ్మాటలోని మామిడి తోటలో పని కుదుర్చుకున్న తర్వాత చోరీలకు ప్లాన్ చేశారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో రాత్రి సమయంలో ఎవరూ లేని ఇళ్లలో చోరీలు మొదలు పెట్టారు. ఇందులో భాగంగా ఇటీవల జనగామ పరిధిలో కూడా వరుస చోరీలకు పాల్పడ్డాడు. ఈ ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేసి దొంగల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో మరోసారి చోరీలకు ప్లాన్ చేసుకున్న ఈ ముగ్గురు దొంగలు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. సోమవారం నెహ్రూ పార్కు వద్ద ఏసీపీ పార్థసారధి ఆధ్వర్యంలో సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై భరత్ వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.5.13లక్షల విలువైన 7.13 తులాల బంగారం, రూ.56 వేల విలువైన వెండి, మొత్తం రూ.5,74,320 లక్షల సొత్తును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ పేర్కొన్నారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై భరత్, కానిస్టేబుళ్లను సీపీ అభినందించినట్లు డీసీపీ తెలిపారు.

అఖండ హరినామ సంకీర్తన



జనగామ: జనగామ పట్టణంలోని బాణాపురం శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో 69వ అఖండ హరినామ సంకీర్తన, పంచకుండాత్మక హవన కార్యక్రమాలు కనుల పండువగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం ఆలయంలో హోమం నిర్వహించారు. 16వ తేదీ చివరి రోజు పూర్ణాహుతి, స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు విజయ్ కుమార్ బజాజ్ తెలిపారు.

ఆలకిస్తూ.. ఆదేశిస్తూ..

- గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- ప్రజల సమస్యలపై దృష్టి పెట్టండి
- తప్పు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక
- అధికారులకు ఆదేశాలు జారీ



అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

జనగామ: భూసంబంధిత సమస్యలు.. పింఛన్ రావడం లేదని ఒకరు.. సదరం సర్టిఫికెట్ రిజక్టు చేశారని మరొకరు.. పంటరుణం తీసుకోకున్నా మాఫీ చేశారు.. విచారణ చేపట్టాలని ఓ న్యాయవాది ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వచ్చిన 85 మంది ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషాకు మొర పెట్టుకున్నారు. వారు చెప్పే విషయాలు ఆలకిస్తూ.. సంబంధిత అధికారులను పిలిపించి మండలాలకు సంబంధించి పలు అర్జీల విషయమై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీవెన్స్‌కు వచ్చే వినతులపై దృష్టి పెట్టాలని, మండలాల పరిధిలో తీరే సమస్యలను అక్కడిక్కడే పరిశీలించాలని, తప్పు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, ఆయా శాఖల జిల్లా అధికారులు వినోద్‌కుమార్, వసంత, స్వరూప, రవీందర్, రాణాప్రతాప్, రాజేందర్‌రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

రుణమాఫీ ఎందుకు కాలేదు..



పాలకుర్తి కోఆపరేటివ్ సొసైటీలో నా రెండో కుమారుడు వెంకటేశ్వర్లు పేరున రూ.91వేల పంట రుణం తీసుకున్నా. మొదటి, రెండో విడతలో రైతులకు రుణమాఫీ అయితే.. మా పేరు జాబితాలో లేదు. వ్యవసాయాధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు. రుణమాఫీ అవుతుందా లేదా అని ఆందోళన వ్యక్తం చేయగా న్యాయం చేస్తామని కలెక్టర్ చెప్పారు. జాబితాలో పేరు ఎందుకు రాలేదనే విషయమై విచారిస్తామని జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ తెలిపారు.

- కార్పోజుల చిన్న సోమయ్య, రైతు, చెన్నూరు

గ్రామ కార్యదర్శిపై విచారణ చేపట్టాలి



గ్రామ కార్యదర్శి డబ్బు వసూలు చేసి అక్రమాలకు పాల్పడుతున్నాడు. అదనంగా వసూలు చేస్తూ వాటికి రశీదు అడిగితే ఇతరుల ఫోన్‌పే, యాప్‌ల ద్వారా పంపించాలని చెబుతున్నాడు. ఇంటి అనుమతులు, వెంచర్ల వద్ద వసూలు చేసిన డబ్బు జీపీ రికార్డుల్లో నమోదు చేయడం లేదు. ఇటీవల ఇచ్చిన అనుమతులపై విచారణ చేపట్టాలి.

- గొల్లపల్లి జాన్, పోచన్నపేట(బచ్చన్నపేట)

న్యాయం చేయాలి..



గ్రామంలో నాకు ఆరెకరాల 22 గుంటల భూమి ఉంది. నా పేరిట 38 గుంటలు, భార్య మల్లికాంబ పేరిట ఉన్న 10 గుంటల భూమి రికార్డులో ఎక్కలేదు. ఆ భూమిని పట్టా పుస్తకంలో నమోదు చేయాలని ఏళ్ల తరబడి రెవెన్యూ అధికారుల చుట్టు తిరుగుతున్నా ఫలితం లేదు. విచారణ చేపట్టి న్యాయం చేయాలి.

- గాదె శ్రీహరి, ఖిలాషాపూర్, రఘునాథపల్లి

సర్కారు ఆదాయానికి గండి కొడుతున్నారు..



గ్రామంలోని మూడు సర్వే నంబర్ల పరిధిలో నాలా కల్వర్టు చేపట్టారు. గజాల లెక్కన(కమర్షియల్) రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా.. గుంటల లెక్క చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని సింగారపు రమేష్, రవీందర్‌రెడ్డి, ప్రశాంత్, భిక్షపతి, కాసర్ల మాధవరెడ్డి, నల్ల నరేందర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై కలెక్టర్ విచారణకు ఆదేశించినట్లు వారు తెలిపారు.

- నీర్మాల ప్రజలు, దేవరుప్పల

రుణమే తీసుకోలేదు.. ఎలా మాఫీ అయ్యింది



కంచనపల్లి సహకార సొసైటీలో 2014 సంవత్సరం నాలుగెకరాల స్థలం పహాణీ చూపించి ఓటుహక్కు నమోదు చేసుకున్నా. సొసైటీలో రుణం తీసుకోకున్నా రూ.2లక్షల తీసుకున్నట్లు రికార్డులో కనిపిస్తుండగా.. ఇటీవల ప్రభుత్వం రూ.54వేల పంట రుణం మాఫీ చేసినట్లు కబురు పంపించారు. రూ.857 డ్యూ ఉన్నట్లు రికార్డులో చూపిస్తోంది. అసలు రుణమే తీసుకోలేదు. ఎలా మాఫీ అయింది. నా పేరిట దొంగతనంగా రుణం తీసుకున్న వారు ఎవరో బయటకు రావాలి. పీఏసీఎస్‌ల పరిధిలో ఇలా ఎన్ని జరిగాయో దర్యాప్తు చేపట్టాలి. గతంలోనూ అనేక అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదు రాగా సంబంధిత సీఈఓను సస్పెండ్ చేశారు.

- మన్నె సత్తయ్య, జనగామ కోర్టు న్యాయవాది, మేకలగట్టు

క్లుప్తంగా

ఆర్వో ఆఫీస్‌లో సాంకేతిక లోపం..

- రెండున్నర గంటలు నిలిచిన రిజిస్ట్రేషన్లు

కాజీపేట అర్బన్ : వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సోమవారం సాంకేతిక లోపం తలెత్తింది. ఈ ప్రభావం రిజిస్ట్రేషన్లపై పడింది. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ తమ కార్యకలాపాలకు ఉపయోగించే రేయిల్ టెల్ నెట్‌వర్క్ కేబుల్ వరంగల్ ప్రాంతంలో తెగింది. దీంతో నెట్ వర్క్ పని చేయకపోవడంతో రిజిస్ట్రేషన్లు జరగలేదు. ఉదయం 10.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తలెత్తిన సాంకేతి లోపంతో రిజిస్ట్రేషన్లు నిలిచాయి. కేబుల్ వైర్‌కు మరమ్మతుల అనంతరం రిజిస్ట్రేషన్లు యథావిధిగా కొనసాగాయి. కాగా, రోజూ 60 నుంచి70 రిజిస్ట్రేషన్లు జరిగే వరంగల్ ఆర్వో కార్యాలయంలో సోమవారం కేవలం 46 దస్తావేజులకు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగాయి.

భూసార పరీక్షల మేరకు ఎరువులు వాడాలి

హన్మకొండ: భూసార పరీక్ష ఫలితాలను బట్టి ఎరువుల యాజమాన్యం చేపట్టాలని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి అన్నారు. సోమవారం వరంగల్ పైడిపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నాబార్డు ఆర్థిక సాయంతో రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఉమారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రైతులు క్రమం తప్పకుండా భూసార పరీక్షలు చేయించాలని, భూసార పరీక్ష ఆధారంగానే ఎరువులు వాడుకోవాలని సూచించారు. పచ్చిరొట్ట పైర్లు జినుము, జీలుగ, పెసర పంటలు సాగు చేసి నేలలో కలియదున్నాలన్నారు. పత్తి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్.జి.వీరన్న మాట్లాడుతూ పత్తి పంటలో అధిక దిగుబడి రావడానికి అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేపట్టాలన్నారు. బోదె సాళ్ల పద్ధతిలో విత్తుకోవాలని, సరైన కలుపు మందు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ నిర్వాహకుడు సి.హెచ్.రాములు, శాస్త్రవేత్త షణ్ముఖరావు, రైతులు పాల్గొన్నారు.

సింగారం క్రాస్ వద్ద 15 కేజీల గంజాయి పట్టివేత

మామునూరు: వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో సింగారం క్రాస్ వద్ద 15 కేజీల ఎండు గంజాయి పట్టుపడింది. మామునూరు పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఏపీలోని విశాఖపట్నంకు చెందిన గేదల శ్రీరాం తన కారులో ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న 15 కేజీల ఎండు గంజాయి పట్టుబడింది. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి కారు, 15 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కృష్ణవేణి తెలిపారు.

‘రీచింగ్ ద అన్ రీచ్‌డ్’ సత్తా..

- మొదటి స్థానంలో నిలిచిన అడవి బిడ్డలపై లఘుచిత్రం
- తాడ్వాయి మండలం బయ్యక్కపేటలో చిత్రీకరణ


లఘుచిత్రం తీసిన నీలంతోగు పాఠశాల

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని బయ్యక్కపేట పరిధి అటవీ ప్రాంతంలోని నీలంతోగు గొత్తికోయ గూడెంలో ఏర్పాటు చేసిన బీం చిల్డ్రన్ హ్యాపీనెస్ కేంద్రాలపై ఈఎమ్మార్సీ డైరెక్టర్ రఘుపతి రూపొందించిన లఘు చిత్రం ‘రీచింగ్ ద అన్ రీచ్‌డ్’ అభివృద్ధి విభాగంలో మొదటి స్థానం కైవసం చేసుకుంది. యూజీసీ– సీఈసీ 16వ అంతర్జాతీయ ప్రకృతి ఫిల్మ్ ఫెస్టివల్ కోసం జరిగిన లఘుచిత్ర పోటీల్లో ఓయూ ఎడ్యుకేషనల్ మల్టీమీడియా రీసెర్చ్ సెంటర్ (ఈఎమ్మార్సీ) సత్తా చాటింది. ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లోని విద్యార్థుల స్థితిగతులపై ఈఎమ్మార్సీ డైరెక్టర్ పి. రఘుపతి రూపొందించిన లఘుచిత్రం మానవహక్కుల విభాగంలోనూ సైటేషన్‌కు ఎంపికైంది. యూజీసీ, సీఈసీ ఏటా పర్యావరణం, అభివృద్ధి, మానవహక్కులు, స్వచ్ఛ భారత్ విభాగాల్లో లఘుచిత్ర పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో ఎంపికైన చిత్రాలను ఏటా నిర్వహించే ప్రకృతి అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శిస్తారు. విజేతలకు ప్రశంసపత్రం, నగదు బహుమతి అందజేస్తారు. జనజీవనానికి దూరంగా అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గొత్తికోయగూడెం నీలంతోగుతోపాటు మరో 8 చోట్ల పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే ఉద్దేశంతో ఓయూ జర్నలిజం విద్యార్థులు ఇస్రం సంతోశ్ తన మిత్ర బృందంతో కలిసి ఏకోపాధ్యాయ భీం చిల్డ్రన్ హ్యాపీనెస్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిపై రఘుపతి లఘుచిత్రం రూపొందించడం అభినందనీయమని ఓయూ రిజిస్ట్రార్ పి. లక్ష్మీనారాయణ అన్నారు. ఈ అవార్డు దక్కడం ఓయూకు గర్వకారణమని, ఈఎమ్మార్సీకి మరింత ఉత్సాహాన్నిస్తుందని తెలిపారు. రోజూ ఐదు నుంచి ఏడు కిలోమీటర్లు అటవీ ప్రాంతంలో ప్రయాణించి చిన్నారులకు విద్యతో పాటు బయట సమాజాన్ని పరిచయం చేసేందుకు వలంటీర్లు చేస్తున్న కృషిని ఈఎమ్మార్సీ డాక్యుమెంటరీగా మలిచింది. ప్రకృతి అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ లో మొదటిసారి ఓయూ ఈఎమ్మార్సీకి అవార్డు దక్కడం గర్వకారణం. ఈ నెల 16వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో రఘుపతి ఈ అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా లఘుచిత్ర రూపకర్త రఘుపతిని ఓయూ ఇన్‌చార్జ్ వీసీ దానకిశోర్, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, యూజీసీ డీన్ ప్రొఫెసర్ జి. మల్లేశం అభినందించారు. ఇలాంటి లఘుచిత్రాలు మరిన్ని రూపొందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్యుమెంటరీ రూపకల్పనలో తనకు సహకరించిన ఎన్‌జీఓలకు రఘుపతి కృతజ్ఞతలు తెలిపారు.


ఈఎమ్మార్సీ డైరెక్టర్ పి. రఘుపతి

వరుసగా ఏసీబీ దాడులు

8నెలలు..11 మంది

సాక్షిప్రతినిధి, వరంగల్/వరంగల్‌క్రైం/ మహబూబాబాద్ అర్బన్: ఎనిమిది నెలల వ్యవధిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11మంది అవినీతి అధికారులను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..

- జనవరి 5న కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ (ఆడిట్ విభాగం) అధికారులపై దాడులు చేశారు.
- జనవరి 11న ఓ ఫార్మసిస్టు నుంచి రూ.50 వేలు తీసుకుంటుండగా జనగామ డీఎంహెచ్‌ఓ, జూనియర్ అసిస్టెంట్‌లను పట్టుకున్నారు.
- మార్చి 4న తొర్రూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అక్రమాస్తులపై దాడులు నిర్వహించారు.
- మార్చి 22న ప్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమూద్ రూ.19,200 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
- ఏప్రిల్ 15న ఆర్టీసీ డ్రైవర్‌పై నమోదైన కేసును ఎత్తివేసేందుకు ఆ డ్రైవర్‌నుంచి హుజూరాబాద్ డీఎం హనుమకొండలో రూ.20వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.
- మే 20న వ్యవసాయ భూమి గిఫ్ట్ రిజిస్ట్రేషన్ కోసం కమలాపూర్ మండల కన్నూరుకు చెందిన ఓ రైతు నుంచి రూ.5 వేల లంచం తీసుకుంటుండగా తహసీల్దారు మాధవి, కంప్యూటర్ ఆపరేటర్ రాకేశ్‌లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
- జూన్ 30న అవినీతి, ఆరోపణలతో వరంగల్ ఆర్డీఓ సిదం దత్తును కరీంనగర్ ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. 2019లో ఆసిఫాబాద్ ఆర్డీఓగా దత్తు పనిచేసినప్పుడు భూసేకరణలో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణల కేసులో అరెస్ట్ చేశారు.
- జూలై 25న వారసత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేయడానికి పరకాల మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన లాడే శ్రీనివాస్, శ్రీకాంత్ నుంచి రూ.80వేల లంచం తీసుకుంటూ పరకాల సబ్ రిజిస్ట్రార్ కె.సునీత ఏసీబీ అధికారులకు పట్టుబడింది.
- జూలై 6న జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లి మాజీ సర్పంచ్ గవ్వాని విజయ భర్త నాగేశ్వర్‌రావు గ్రామంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లుల మంజూరుకు ఆయననుంచి ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి పగిడె శివాజీ రూ.20వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.
- తాజాగా గ్రామంలో చేసిన అభివృద్ధి పనికి బిల్లులు పాస్ చేసేందుకు రూ.10వేల లంచం తీసుకుంటూ జనగామ జిల్లా పాలకుర్తి ఇరిగేషన్ ఏఈ, గ్రామ ప్రత్యేక అధికారి గోపాల్ సోమవారం హనుమకొండలో ఏసీబీ అధికారులకు చిక్కాడు.
- మానుకోట జిల్లా రవాణాశాఖ అధికారి (డీటీఓ)గౌస్ పాషాపై గతంలో వచ్చిన అవినీతి ఆరోపణలు వాస్తవమని తేలడంతోపాటు ఆయనతోపాటు, ప్రైవేట్ అసిస్టెంట్ సుబ్బారావు, కారు డ్రైవర్ రామ్‌గోపాల్‌ను ఏసీబీ అధికారులు సోమవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో అరెస్ట్ చేశారు. ఏజెంట్లు, వాహన యజమానుల నుంచి రూ. 2,97,38,000 లంచం వసూలు చేసినట్లు విచారణలో గుర్తించారు.

అత్తామామపై అల్లుడి దాడి

- మామ మృతి, అత్త పరిస్థితి విషమం
- భార్యను కాపురానికి పంపించడం లేదనే కారణంతో ఈ ఘాతుకం


నర్సయ్య(ఫైల్)


నర్సమ్మను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

మంగపేట: భార్య కాపురానికి రావడం లేదని అత్తామామలపై ఓ అల్లుడు దాడి చేశాడు. ఈ ఘటనలో మామ చనిపోగా, అత్త పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన ములుగు జిల్లా మంగపేట మండలం బాలన్నగూడెం పంచాయతీ పరిధిలోని నీలాద్రిపేటలో సోమవారం చోటుచేసుకుంది.ఎస్సై టీవీఆర్ సూరి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గౌరై నర్సయ్య(56), నర్సమ్మ దంపతుల రెండో కుమార్తె స్వప్నకు అదే గ్రామానికి చెందిన గాందెర్ల రామకృష్ణతో 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. రామకృష్ణ అదే గ్రామానికి చెందిన మరో మహిళను వివాహం చేసుకోవడంతో స్వప్న తన కుమారుడు, కూతురుతో కలిసి రెండేళ్ల నుంచి తన తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం స్వప్న కిరాణ షాపు వద్దకు వెళ్లింది. భర్త రామకృష్ణ తనతో ఎందుకు మాట్లాడడం లేదని వెంబడిస్తున్న క్రమంలో ఇంటికి పరిగెత్తింది. ఈ క్రమంలో తండ్రి నర్సయ్య, తల్లి నర్సమ్మ ఇంటి నుంచి బయటకు వచ్చి తన కూతురు వెంట ఎందుకు పడుతున్నావని ప్రశ్నిస్తున్న క్రమంలో ‘మీ వల్లే నా భార్య కాపురానికి రావడం లేదు.. మిమ్మల్ని చంపితేనే నా భార్య నా దగ్గరికి వస్తుంది’ అని కోపంతో మామ నర్సయ్యను ఎడ్లబండికి ఉన్న కర్ర తీసుకుని విచక్షణారహితంగా తలపై బలంగా కొట్టాడు. అదే విధంగా అడ్డుకోబోయిన నర్సమ్మను సైతం కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. ఇద్దరిని వరంగల్ ఎంజీఎం తరలిస్తుండగా నర్సయ్య మార్గమధ్యలో మృతి చెందాడు. నర్సక్క పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై టీవీఆర్ సూరి ఘటనాస్థలిని పరిశీలించారు. దాడిపై గ్రామస్తుల ద్వారా వివరాలు సేకరించారు. అనంతరం ఈ ఘటనపై మృతుడి చిన్న కుమార్తె సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు

- వివరాలు వెల్లడించిన ఎస్పీ శబరీష్


లొంగిపోయిన మావోయిస్టులను చూపుతున్న ఎస్పీ శబరీష్, ఓఎస్‌డీ మహేశ్ గీతె భగత్

ములుగు : సీపీఐ మావోయిస్టు పార్టీ యూజీ క్యాడర్‌కు చెందిన ఇద్దరు మావోయిస్టులు సోమవారం ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్ ఎదుట లొంగిపోయారు. ఎస్పీ శబరీష్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రెడ్లలంప గ్రామానికి చెందిన దుడ్ల తేజ అమర్‌నాథ్ రెడ్డి అలియాస్ అర్జున్‌కు ఒడిశాలోని బరంపూర్‌కు చెందిన అన్నెం చందర్‌రావుతో ఫేస్ బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. అతడి ప్రేరణతో సీపీఐ మావోయిస్టు పార్టీలో చేరాలనుకున్నాడు. దీంతో చందర్ రావు.. అర్జున్‌కు కాకర్ల రవి ఫోన్ నంబర్ ఇచ్చి అతడిని కలవాలని సూచించాడు. దీంతో 2021 డిసెంబర్25న ఛత్తీస్‌గఢ్ వెళ్లిన అర్జున్‌ను కాకర్ల రవి మావోయిస్టు పార్టీలో చేర్చుకున్నాడు. డిసెంబర్ 2022లో ప్రమోషన్ పొందిన అర్జున్ 8 ఎంఎం రైఫిల్ పొందాడు. 2024 జనవరిలో బీకే ఏఎస్ఆర్ డీవీసీ ఏసీఎంగా పదోన్నతి పొందాడు. 2024 జూలై 21నుంచి 2024 జూలై 30 వరకు 50 మంది ఇతర సభ్యులతో ఎంఎల్‌టీ శిక్షణ పొందాడు. అర్జున్ ఎక్కువ ఆజాద్ ఎస్‌సీఎం దక్షిణ బస్తర్ ప్రాంతాల్లో ఉన్నాడు. మరో మావోయిస్టు గాలి నారాయణరెడ్డి అలియాస్ రాజ్‌కుమార్ అలియాస్ ప్రసాద్ పార్టీ మెంబర్. నారాయణరెడ్డి స్వగ్రామం ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా కొత్తపల్లి మండలం వీర్రాంపల్లి గ్రామం. అన్నెం చందర్‌రావుతో ఫేస్ బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. అనంతరం చందర్‌రావు.. కాకర్ల రవి ఫోన్ నంబర్ ఇచ్చి అతడిని కలవాలని పేర్కొనగా నారాయణరెడ్డి.. కాకర్ల రవిని సంప్రదించి 2020 అక్టోబర్ 3న మావోయిస్టు పార్టీలో చేరాడు. పార్టీ కార్యకలాపాలను విస్తరించడానికి సందీప్ ఏసీఎం శబరి ఎల్ఓఎస్ కమాండర్‌తో కలిసి 2023 జనవరిలో చింతూరు ప్రాంతానికి వెళ్లిన నారాయణరెడ్డిని ఏటిపాక పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అమర్నాథ్ రెడ్డిపై ఉన్న రూ. 4 లక్షలు, నారాయణ రెడ్డిపై ఉన్న రూ. లక్ష రివార్డులను డీడీ రూపేనా అందించనున్నట్లు తెలిపారు. ఎస్పీ వెంట ఓఎస్‌డీ మహేశ్ గీతె భగత్, ములుగు డీఎస్పీ రవీందర్ ఉన్నాడు.

ఏఈఈ ఫలితాల్లో అభినవ్ ప్రతిభ

- రాష్ట్రస్థాయిలో 8, మల్టీజోన్–1లో 2వ ర్యాంకు


కరిమిల్ల అభినవ్

హన్మకొండ: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఏఈఈ పోస్టుల ఫలితాల్లో హనుమకొండ అడ్వకేట్స్ కాలనీకి చెందిన కరిమిల్ల అభినవ్ రాష్ట్ర స్థాయి 8వ ర్యాంకు సాధించారు. 2022 సెప్టెంబర్‌లో ఏఈఈ సివిల్ పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2023 మే 21న రాత పరీక్ష నిర్వహించింది. ఇటీవల ఫలితాలు విడుదల చేసింది. ఈ ఫలితాల్లో అభినవ్ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సాధించారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ కరిమిల్ల వెంకటేశ్వర్ రావు, సుకన్య దంపతులు అడ్వకేట్స్ కాలనీలో నివాసముంటున్నారు. ఈ దంపతుల కుమారుడు అభినవ్ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రహదారుల భవనాల శాఖలో ఏఈఈ సివిల్ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షకు హాజరై రాష్ట్ర స్థాయి 8వ ర్యాంకు, మల్టీజోన్–1లో 2వ ర్యాంకు సాధించి ఉమ్మడి వరంగల్ జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. త్వరలో పోస్టింగ్ ఇవ్వనున్నారు.

19 వరకు దరఖాస్తుల స్వీకరణ

హన్మకొండ కల్చరల్ : వరంగల్ ప్రాంగణంలోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 2024–25 సంవత్సరానికి గాను ఆలస్య రుసుముతో ఈ నెల 19వరకు ఎం.ఏ తెలుగు రెగ్యులర్ కోర్సు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన ఆసక్తి గల విద్యార్థులు ప్రవేశాలు పొందొచ్చని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. తెలుగు యూనివర్సిటీ వెబ్ సైట్ www.teluguuniversity.ac.in, www. pstucet.org లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రుణమాఫీ అర్హుల వివరాలు పంపని సిబ్బందిపై చర్యలు

- డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు


మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

హన్మకొండ : రుణమాఫీకి అర్హులైన రైతుల వివరాలు ప్రభుత్వానికి పంపని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు బాధ్యులైన సిబ్బంది వివరాలు జిల్లా సహకార అధికారులకు పంపాలని వరంగల్ డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారిని టెస్కాబ్ చైర్మన్, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ఆదేశించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో డీసీసీబీ బ్రాంచీ బ్యాంకు మేనేజర్లు, ప్రధాన కార్యాలయం అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డీసీసీబీ ప్రగతిని సమీక్షించారు. రుణమాఫీపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ రైతు రుణమాఫీ పథకాన్ని ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్నారన్నారు. అయితే అర్హులైన రైతుల వివరాలు పంపడంలో సిబ్బంది అలసత్వం వహించడం, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం సహించరానిదన్నారు. అదే విధంగా రుణమాఫీ 2024 కింద లబ్ధి పొందిన రైతులకు త్వరితగతిన తిరిగి కొత్త పంట రుణాలు ఇవ్వాలని సూచించారు. అదే విధంగా అర్హత గల రైతులకు సంబంధించిన ఇన్‌వాలీడ్ ఆధార్‌లుగా ఉన్న ఎర్రర్‌లను ప్రభుత్వ అనుమతితో ఈ నెల 19వ తేదీలోపు సరైన ఆధార్ ప్రతులను సమర్పించి రైతులకు లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. లోన్ రికవరీ, పాలసీ మార్గదర్శకాలు, బంగారం రుణాలు, డిపాజిట్లపై సమీక్షించారు. సీఈఓ వజీర్ సుల్తాన్, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, స్రవంతి పాల్గొన్నారు.

పెళ్లయిన వ్యక్తితో ప్రేమాయణం

- వరుసకు అన్నాచెల్లెళ్లు.. మందలించిన పెద్దలు
- చెరువులో దూకి ఇద్దరూ బలవన్మరణం


దిలీప్, అంజలి (ఫైల్)

రాయపర్తి: అతనికి పెళ్లయ్యింది. కానీ వరుసకు చెల్లె అయ్యే యువతితో చాలాఏళ్ల ప్రేమ.. పెద్దలు పలుమార్లు మందలించారు. చివరికి ఆ జంట చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలకేంద్రంలోని రామచంద్రుని చెరువు వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా పైడిపల్లి పరిధిలోని మధ్యగూడానికి చెందిన తిక్క అంజలి(25), అదే గ్రామానికి చెందిన సంగాల దిలీప్(30) కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ దగ్గరి బంధువులు కావడం, అందులోనూ వరుసకు అన్నాచెల్లెళ్లు కావడంతో పెద్దలు ఒప్పుకోరనే ఉద్దేశంతో ఉన్నారు. ఈ క్రమంలో ఎనిమిదేళ్ల క్రితం దిలీప్‌కు వరంగల్ జిల్లా నెక్కొండ మండలం జంజరపల్లికి చెందిన ఓ యువతితో వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు కుమార్తెలు జన్మించారు. అయినా వీరి ప్రేమను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం దిలీప్ వరంగల్ హంటర్‌రోడ్డులో ఓ మార్బుల్ దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తుండగా, అంజలి ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా చేస్తుంది. వీరి ప్రేమ విషయం భార్యకు తెలియడంతో చాలా రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల భార్య తన పుట్టింటికి వెళ్లింది. దీంతో దిలీప్.. అంజలితో తిరగడం ప్రారంభించారు. విషయ పెద్దలకు తెలియగా నాలుగురోజులక్రితం మందలించారు. ఇప్పటినుంచి అలా తిరగమని చెప్పి వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో దిలీప్ ఆదివారం ఉదయం 9:30 గంటల సమయంలో డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎక్కడికో వెళ్లి ఉంటాడనుకున్నారు. సోమవారం ఉదయం రాయపర్తిలోని రామచంద్రుని చెరువులో రెండు మృతదేహాలు ఉన్నాయని పోలీసులకు సమాచారం అందింది. వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ సూర్యప్రకాష్, వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌లతో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను పరిశీలించగా దిలీప్, అంజలిదిగా గుర్తించారు. క్లూస్‌టీంతో పరిశీలించి మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ సూర్యప్రకాష్ తెలిపారు.

బాలికపై లైంగిక దాడి యత్నం కేసు.. నేరస్తుడికి పదేళ్ల జైలు

- తీర్పు వెలువరించిన వరంగల్ జిల్లా మొదటి అదనపు కోర్టు జడ్జి ప్రేమలతారెడ్డి



వరంగల్ లీగల్ : బాలికపై లైంగిక దాడికి యత్నించిన కేసులో నేరం రుజువుకావడంతో చెన్నారావుపేట మండల ఖాదర్‌పేటకు చెందిన నేరస్తుడు కొనకటి రఘుపతికి పది సంవత్సరాల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా మొదటి అదనపు కోర్టు జడ్జి ప్రేమలతారెడ్డి సోమవారం తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మర్రి వాసుదేవరెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వ్యవసాయ భూముల వద్ద ఫిబ్రవరి 11, 2023న ఐదు సంవత్సరాల వయసు గల ఓ బాలిక తన తల్లితో కలిసి ఉంది. అదే గ్రామానికి చెందిన కొనకటి రఘుపతి మధ్యాహ్న సమయంలో అక్కడికి వచ్చి జామ కాయలు ఇస్తానని చెప్పి బాలికను తీసుకెళ్లాడు. చేతులు, వేళ్లతో సదరు బాలికపై తాకరాని చోట తాకుతూ లైంగిక దాడికి యత్నించాడు. ఈ విషయం బాలిక తన తల్లికి చెప్పింది. వెంటనే ఆమె ఫోన్ ద్వారా తన భర్త (బాలిక తండ్రి)కి సమాచారం ఇచ్చింది. బాధిత బాలిక తండ్రి గ్రామానికి వచ్చి రఘుపతిని నిలదీశాడు. బాలిక జరిగిన విషయం చెప్పి రఘుపతిని చూపించగా అక్కడి నుంచి పారిపోయాడు. వెంటనే బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నేరం రుజువుకావడంతో నేరస్తుడు కొనకటి రఘుపతికి పది సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి ప్రేమలతారెడ్డి తీర్పు ఇచ్చారు. కేసును పోలీస్ అధికారులు టి.మహేందర్, జి.అరుణ్ పరిశోధించగా లైజన్ ఆఫీసర్ ఎం.వెంకటస్వామి, భరోసా లీగల్ ఆఫీసర్ సీహెచ్ నీరజ పర్యవేక్షణలో సాక్షులను కానిస్టేబుల్ టి.సురేందర్, హోంగార్డు ధర్మరాజు కోర్టులో ప్రవేశపెట్టారు.



పోక్సో కేసులో నిందితుడికి రెండేళ్లు..

కాళేశ్వరం: పోక్సో కేసులో మహదేవపూర్ మండలం సూరారం గ్రామానికి చెందిన ఎనపరెడ్డి అర్జున్‌కు రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ భూపాలపల్లి పోక్సో కోర్టు జడ్జి పి.నారాయణబాబు సోమవారం తీర్పు వెలువరించారు. పోలీసుల కథనం ప్రకారం.. 2020 సంవత్సరంలో అర్జున్ అదే గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. ఒకరోజు కుటుంబ సభ్యులు లేని సమయంలో ఇంట్లోకి ప్రవేశించి బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేయగా భయపడి పారిపోయాడు. ఈ ఘటనపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అప్పటి ఎస్సై అనిల్‌కుమార్ సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. ప్రస్తుత కోర్టు కానిస్టేబుళ్లు కే రమేశ్, వరలక్ష్మి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.విష్ణువర్ధన్ రావు ఈ కేసులో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదోపవాదాలు విన్న భూపాలపల్లి జిల్లా పోక్సో జడ్జి పి.నారాయణబాబు నిందితుడు అర్జున్‌కు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 11 వేల జరిమానా విధించారని పోలీసులు వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

- వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పించబడును. CIBIL అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు, హన్మకొండ. సెల్: 8331878592. [WA-6517]
- వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టి మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్: 9501065342 [T-270]

VEHICLE OF SALE

- 2022 Model Eicher PRO 3015 20FT BS6, Registration No: TS24TA0384, Vehicle for Sale M/s. IndusInd Bank Ltd. Cell: 9849594648, 9959455260. [W-1242443]

FINANCE SERVICES

- సిరి అసోసియేట్స్: అన్ని రకాల రుణాలు, పర్సనల్, హౌసింగ్, మార్ట్‌గేజ్, ఓపెన్ ప్లాట్స్‌పై కూడా సిబిల్ ప్రొబ్లం ఉన్న చేయించబడును. సెల్: 9666142226. [W-1239823]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

BUSINESS OFFER

- ICF కార్పొరేషన్ అగ్రికల్చర్, బిజినెస్, పర్సనల్, ఎడ్యుకేషన్, ప్రాపర్టీ పైన అమౌంట్ ఇవ్వబడును. ఏజెంట్స్ & DMA కావలెను. జీ+కమీ॥. ఫోన్: 7988242391 [H-778959]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రైల్వే కార్మికుల ఆందోళన..

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్


డీజిల్ షెడ్ ఎదుట ఆందోళన చేస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని డీజిల్ లోకోషెడ్, ఎలక్ట్రిక్ లోకోషెడ్, రైల్వే పి.వే నార్త్ ఇంజనీరింగ్ కార్యాలయం ఎదుట రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు సోమవారం రైల్వే కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆందోళనలు చేపట్టారు. కేంద్రం రైల్వే కార్మికులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. కోవిడ్ సమయంలో ఇవ్వాల్సిన 18 నెలల పెండింగ్ డి.ఎ బకాయిలు చెల్లించాలన్నారు. 8వ పే కమిషన్ ఏర్పాటు చేయాలని, రైల్వేలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు ఎస్.కె.జానీ మియా, పి.వేదప్రకాశ్, ఇబ్రహీం, ఎన్.సదానందం, బచ్చలి శ్రీనివాస్, సాంబరాజు, శివ, ప్రవీణ్, భాస్కర్, గాయత్రి, రాజేందర్, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

పసికందు మృతదేహానికి పోస్టుమార్టం

ఎంజీఎం: మూడు రోజుల క్రితం ఎంజీఎంలో కుక్కలు పీక్కుతిన్న పసికందు మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఇందులో పసికందు మృతిచెందాకే కుక్కలు పీక్కుతిన్నట్లు గుర్తించారు. పసికందు ఆడ, మగ శిశువా అనే విషయం గుర్తించకుండా ఆ ప్రాంతమంగా పీక్కుతిన్నాయి. కుక్కలు పీక్కుతినే రెండు, మూడు గంటలు ముందే పసికందు చనిపోయినట్లు నిర్ధారించారు. ఆ రోజు సీకేఎం, జీఎంహెచ్‌తో పాటు ఏయే ఆస్పత్రుల్లో శిశువులు మృతి చెందారో అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ఆభరణాలతోపాటు మద్యం సీసాలనూ ఎత్తుకెళ్లారు

- కురవి ఆలయ మాజీ చైర్మన్ ఇంట్లో చోరీ
- తాళం వేసి హైదరాబాద్ వెళ్లిన కుటుంబీకులు


ఈ వెంటిలేటర్ రంధ్రం నుంచే గదిలోకి దిగిన దొంగలు


చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్సై గోపి

కురవి : ఇంట్లోని బంగారు, వెండి ఆభరణాలతోపాటు మద్యం సీసాలనూ దొంగలు అపహరించారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగింది. సోమవారం ఉదయం పనిమనిషి ఇంటి ఎదుట ఊడ్చేందుకు రాగా తలుపుతీసి ఉండడంతో చోరీ వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీవీరభద్రస్వామి ఆలయ మాజీ చైర్మన్ మేక దామోదర్‌రెడ్డి కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. దొంగలు ఇంటి మెట్ల దగ్గర చతురస్రాకారంలో ఉన్న వెంటిలేటర్ నుంచి ఇంట్లోకి వెళ్లారు. రెండు బెడ్‌రూమ్‌ల్లోని బీరువా, కబోర్డ్ డోర్‌లను తెరిచి అందులో ఉన్న వెండి, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. కబోర్డ్‌లో ఉన్న కొన్ని మద్యం సీసాలను సైతం తీసుకెళ్లారు. ఇంటి ముందు ఊడ్చడానికి వచ్చిన మహిళకు ఇంటి పక్కన ఉన్న గల్లీలోని తలుపు తీసి ఉండడాన్ని గమనించి దొంగలు పడ్డారని భావించి చుట్టుపక్కల ఉన్న వారికి సమాచారం అందించింది. దీంతో చుట్టుపక్కల ఉన్న జనాలు ఇంటి వద్దకు వచ్చి లోపలికి వెళ్లి చూశారు. విషయాన్ని కురవి ఎస్సై గోపికి సమాచారం అందజేశారు. 5తులాల బంగారం, 15తులాల వెండి, రూ.15వేల నగదు, నాలుగైదు మద్యం సీసాలను అపహరించినట్లు గుర్తించారు. చోరీ జరిగిన ప్రదేశాల్లో క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. బాధితుడు మేక దామోదర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.